


# గూడు

## కొండూరి రామరాజు

**పౌర్ణమి!**

నిండుగా ఉంది చందమామ.

రోడ్డువార గున్నమామిడి చెట్టుకింద కూర్చున్న సీతాలు ఎడముఖంగా కూర్చున్న రాముడు చందమామని అదేపనిగా చూస్తున్నాడు. గున్నమామిడి వాళ్లిద్దరికీ గొడుగు పడుతున్నట్టుంది.

ఊరంతా మాటుమణిగినా రోడ్డు ఇంకా మాటు మణగలేదు. లారీలు, కార్లు వస్తూ పోతూనే ఉన్నాయి. జనం అప్పుడప్పుడూ నడుస్తూనే ఉన్నారు.

జనం అలికిడి గానీ, వాహనాల మోతగానీ వాళ్లని చేరటంలేదు. అలా చూస్తూ రావుడ్నే గమనిస్తున్న సీతాలు తన బాధని ఎలా చెప్పాలో తెలియక కాసేపు అవస్థపడి ధైర్యం చేసింది చివరికి.

"ఏటి మావాఁ, మాట్లాడవు?"

చూపు చందమామ మీద నుంచి సీతాలువైపుకు తిప్పాడు రావుఁడు. అతని చూపుతో వచ్చిన చందమామ ఆమె నుదుటి బొట్టులో పడి కనుమరుగైపోయింది.

"కోపం రాక మరేంటి? నేను నిన్ను చేరటం తప్పా? ఈయాల పున్నమి గందా! ఈ ఎన్నెల్లో ఇలా చూత్తావుంటే, నా మనస్సు నిన్ను కలుసుకోవాలని ఆరాటపడుతున్నాది!"

"తప్పని నే నన్నానా? మనం ఎవళ్లం. మొగుడూ పెళ్లాలం. ఇష్టం కలిగినప్పుడు కల్సుకునే స్వతంత్రం మనకున్నాది. నీకు నా మీద పూర్తి హక్కు వున్నాది. నీ కోరిక తీర్చటం... బాధ్యత నాదే!" అని అంటూండగా

"మరెందుకు ఇయ్యాల బెట్టు చేత్తున్నావు?"

"బెట్టు కాదు, మావాఁ! భయం."

"భయమా?"

"భయమెందుకు నే నుండగా?" అంటూ ఆమెను చేరబోతుంటే మరోసారి వారించింది అతన్ని.

"ఇక నేను ఆగలేను, ఈ తాపం భరించడం నా వొల్ల కాదు.. ఈ ఎన్నెల్లో."

"నాకు మాత్రం లేదూ, నీ వోళ్లో తలెట్టి తొంగుని, నిన్నూ, ఆ చందమామనీ మార్చి మార్చి చూసుకోవాలని!"

"మరింక దేనికి అనుమానం?"

"అనుమానం కాదు, మావాఁ, నా బాధ అర్థం కావటంలేదు."

"అదేంటో చెప్తేనే కదా తెలిసేది?"

"ఈ ఎన్నెల గురించే నా బాధ!"

"ఎన్నెల మన్నేమి చేసింది?"

"మన్నేమి చేసిందంటావా? ఈ రాత్రి నువ్వూ, నేనూ కలవకుండా అడ్డు తగులుతున్నాది."

"ఇవరంగా చెప్పరాదా!"

"మనకి చాటుకి చిన్న గుడిసుందా?"

"లేదు."

"ఈ గున్నమామిడి చెట్టే కదా ఇయ్యాల్టికి మనకిల్లు. ఏదైనా మరుగుందా? చుట్టూ బట్టబయలే. పైగా, వెన్నెల విరగబడి కాస్తోంది. ఈ ఎన్నెల్లకీ, పగలకీ తేడా వుందా? మనుషులెవరైనా పగలు కల్సుకుంటారా? పసువులు, పక్షులు కలుసుకుంటాయి కానీ! అలాగా కల్సుకుంటే మనకీ, ఆటికీ తేడా ఏముంటది?"

"మనమూ అట్టాంటోళ్లమే. మన్ని ఎవురైనా మనుషుల్లాగా చూత్తున్నారా? మనం కల్సుకోటానికి శెంకలెందుకు?"

"ఆళ్ల సంగతి మనకెందుకు మావాఁ? మనం మనుసులం. అంతే!"

"సోదెందుకు, పాయింటుకు రాక రాడదూ!"

"ఎన్నెల పట్ట పగల్లాగ వున్నాది కదా! రోడ్డు మీద జనం ఇంకా తిరుగాడుతూనే వున్నారు. ఎవరెప్పుడొస్తారో, పోతారో తెల్వదు. పైగా, లారీలు, కార్లు మనపక్కనుంచే పోతావుంటే మన సెట్టా వుంటాది, నువ్వే చెప్పు మావాఁ! పోనీ, మన చుట్టూ మరుగు పెట్టుకుందామంటే పాత గుడ్డముక్కైనా వుందా? నా చీర విప్పి కడదామంటే అదీ అతుకుల బొంతే కదా! ఇలాంటిది అడ్డెట్టుకున్నా ఒకటే, లేకున్నా ఒకటే! నాకీ ఒంపుసొంపుల్ని ఆపైవాడు ఎందుకు పెట్టాడో తెలీదు. నీ కోసమే పెట్టుంటాడు. నీ కోసమైనా వాటిని దాసుకోవటం నా అవుసరం కదా మావాఁ! అయినా, రెండు క్షణాల కోరిక కోసం ఈ ఎన్నెల్లో మనం కల్సుకుంటే జరిగే పనేంటో తెలుసా?"

"నువ్వే చెప్పు."

"అటూ ఇటూ పోయేవాడు ఎవడో మనల్ని గమనిస్తాడు. ఆడూ మనిసే కదా! ఆడికీ కోరిక వుంటాది. మనం ఆ కోరికను రెచ్చకొట్టినట్టుంటాది. ఆ సమయంలో ఆడు మనల్ని ఏదైనా చేయటానికి సిద్ధం అయిపోతాడు. నా మానం పోవచ్చు, లేదా నీ పాణం పోవచ్చు. సమయం రానీ, ఓపికపట్టు మావాఁ!"

"ఆ సమయం ఎప్పుడొత్తాది?"

"... వస్తాది."

"ఊరించక, చెప్పు!"

"రేపొచ్చే అమాస. అంతవరకూ ఆగాలి మనం. చీకటి ... కన్నొడుసుకున్నా కాన రాని చీకటి. అంతవరకూ మన శరీరాన్ని, మనసుల్నీ ఎన్నెల్లో

తడిపి... తడిపీ ఆ రోజు చీకట్లో ఆరేసుకుందాం. ఏమంటావు మావా?"

"ఎంత దూరం ఆలోచించావే సీతాలూ! నీలాగ నేను ఆలోచించలేను. నిజమే, మనలాంటోళ్లకి ఎన్నెలకంటే చీకటే నయం. సమయం చిక్కినప్పుడే సుష్టిగా మనసుల్ని కలుపుకుందాం."

"కోపం తగ్గిందా?"

"కోపమా, గీపమా!" అంటూ ఆమె కళ్లల్లోని చందమామల్ని చూస్తూ నిద్రలోకి జారుకున్నాడు రావుడు.

ఆ చందమామల్ని తన కళ్లల్లోనే బంధించి రెప్పలు బిగించి తనూ నిద్రలోకి జారుకుంది సీతాలు.

తెల్లవారింది.

కడుపుకోసం రోడ్డుమీద రావుడు, ఊరు మీద సీతాలూ పడ్డారు. వాళ్ల సంసార మూట గున్నమామిడి చెట్టెక్కి ఊయల ఊగుతోంది.

"మావా, ఊయాల అమాస. గుర్తున్నదా?" అటూ ఇటూ చూసి కన్నుకొట్టి మరీ గుర్తు చేసింది పల్లెకు పోతున్న రాముడికి సీతాలు.

"నీ కెంత గుర్తున్నాదో తెలుసుకుందామని నేనే గుర్తు చేయలేదు. నా కెందుకు గుర్తుండదనుకున్నావు? నిత్యం నీ పొందు కోరే నాకు భలే గురుతెట్టినావు. ఆ రోజు రానే వచ్చింది. సందేళకి వచ్చి నీ వాళ్లో వాలేత్తాను. రడీగుండాల!" అంటూ తనూ కన్నుగీటి మరీ చెప్పి రోడ్డుమీద పడ్డాడు.

అలా పోతున్న మొగుడివంకే కన్నార్పకుండా చూసి చూసి చూపు మరల్చుకోలేక మరల్చుకుని మనస్సులో కోరిక గిలిగింతలు పెడుతుంటే చిరునవ్వు నవ్వుకుని తనూ పనికోసం ఊరుమీదకు పోయింది సీతాలు.

పొద్దుండగానే గున్నమామిడి చెట్టుని చేరుకున్న సీతాలు, చెట్టు చుట్టూరా శుభ్రం చేసి, కళ్లాపి జల్లి వంట పని ముగించి, వండిన వంటని కొమ్మకు వేలాడుతున్న వుట్టిలో ఉంచి స్నానానికి దగ్గర్లో ఉన్న రేవు కాడికి వెళ్లింది.

సీతాలు మనస్సు రేవులో ఈదులాడుతోంది. అలా అలా ఈదులాడుతూ తనను అతను మనువాడినప్పటి సంగతులు, ముచ్చట్లు గుర్తొస్తుంటే కలిగిన ఆ నాటి కోరికల సెగలు రేవు నీళ్లల్లో కలిసి చల్లగా చక్కిలిగింతలు పెడుతున్నాయి.

అవును, అతనికి నేనే ప్రాణం. అతన్ని మనువాడి రెండెల్లి, మూడో ఏడు కావస్తున్నది. తొలినాళ్లలో తనతోటే అతని లోకం. తర్వాత తర్వాత తనే అతన్ని మార్చేసింది. ఇలాగే వుంటే రోజులు గడవ్వు. ఇది ఇదే, పని పనే! ఇదే పనిగా వుండకూడదు. అప్పుడే మనం సుఖంగా బతకగలుగుతాం. ఆనాటి నుంచీ తన మాట ఏనాడూ జవదాటలేదు. కానీ తనమీద వల్లమాలిన కోరిక పుట్టినప్పుడు సమయాసమయాల్ని, పరిసరాల్ని మర్చిపోతూంటాడు. తన అత్త అత్త కాదు. కన్నకూతురిలా సాకి తమలాంటోళ్లు ఎలా బతకాలో కొన్ని మాటలు చెప్పి మరీ పోయింది.

తొలినాళ్లల్లో అతనికోసం పొదలు, కొండలమాటుకి నిర్జన ప్రదేశాలకి వెళ్లింది తను.

ఓ మిట్టమధ్యాహ్నం అతనికి నా మీద మనసైనప్పుడు తల్లితో అబద్ధాలాడి పుల్లలు ఏరుకొద్దాం అని చెప్పి తనతో నన్ను దూరంగా... దూరంగా ఆ వూరు స్మశానంలోకి తీసుకునిపోయి అక్కడున్న రేకుల షెడ్డులో నన్ను చేరి నాలో ఐక్యం అయిపోతూంటే, "ఇదేటి మావా, మిట్టమద్దేల ... అందునా స్మశానం..." అని తను వారిస్తున్నా, "ఊరుకో! మనలాంటోళ్లకి ఇదే సరైన జాగా!" అంటూ తనను మరో మాట మాటాడనీయకుండా నన్ను పూర్తిగా ఆక్రమించుకుని ఆ స్మశానంలో నాకు స్వర్గాన్ని చూపిస్తా వుంటే నేనూ కాదనలేకపోయాను.

నా చెరిగిన జుట్టునీ, నలిగిన శరీరాన్ని చూసి మా యత్త దగ్గరకి చేరదీసి తల నిమిరింది. పట్టపగలు ఎక్కడ పడితే అక్కడ మీరు తిరుగుతావుంటే మనలాంటోళ్లకి మంచిది కాదేవ్మీ! మనం ఊర్లెట్టి తిరేగేటోళ్లం. ఏ పాపిష్టోళ్ల కళ్లల్లోనైనా పడితే మనల్ని మనం కాపాడుకోలేం. జరగకూడనిది జరిగితే మనపక్క చెప్పేటోళ్లే వుండరు.

ఆనాటి నుంచి ఈనాటి వరకూ వెల్తుర్లో తనూ, అతనూ కల్సుకోకుండా జాగ్రత్త తీసుకుంటూ, సమయం చిక్కి వచ్చినప్పుడు ఆ రోజు ఇద్దరమూ ఇద్దరమే. ఇప్పుడు అతనిలో ఎంత మార్పు. ఏనాడూ పనికి బద్ధకించడు. నాకు ఏనాడూ కష్టం కలిగించలేదు. నేను పుణ్యమే చేసుంటాను. అందుకే అతనికి ఆలినైనాను అనుకుంటూ రేవునుంచి ఒడ్డుకి చేరుకుంది సీతాలు.

చీకటి.

క్రమక్రమంగా పరుచుకుంటూ పూర్తిగా ఆవరించేసింది.

సీతాలు ముస్తాబై రావుడికోసం ఎదురుగా ఉన్న రోడ్డుమీదకే చూపు సారించి ఎదురు చూస్తోంది. ఎంతో పని తగిలితే కానీ ఆలస్యం చేయడు తన మావ. లేకపోతే ఈపాటికే చేరి వుండేవాడు అని అనుకుంటూండగా...

ఇటే వస్తున్న వాహనం హెడ్‌లైట్ల కాంతిలో పెద్దపెద్ద అంగలేస్తూ వస్తున్న రావుడు ఆకాశంలో మెరుపులా కనిపించాడు సీతాలుకి.

ఒక్కసారి ఆమె మనస్సు పురివిప్పి నాట్యమాడింది. నీకు నిండు నూరేళ్లు మావా! ఇలా తల్చుకున్నానో, లేదో అలా కనపడ్డావు. రా, మావా, రా! నీ కోసం ... నీ కోసం ఈ సీతాలు కోటి కోరికలతో ఎదురు చూస్తున్నది. ఈ చీకటిలో నాలో నీవు, నీలో నేను ఏకమై, లీనమై ఒకరిలో ఒకరిమై మనల్ని మనం మర్చిపోదాం అని మనస్సులో తలపోస్తూండగా

"ఏయ్ సీతాలూ!" అంటూ ఆమెకు అందీ అందనంత దూరంలోకి వస్తూ పిలిచాడు రావుడు.

"రా, మావా!" అంటూ ఎదురెళ్లబోయిన సీతాలు ఒక్కసారిగా "మావా!" అంటూ గావుకేకపెట్టింది.

ఆ వెనకే వస్తున్న భారీ వాహనం రావుడ్ని ఢీకొట్టడం, అతను గాలిలో గిరికీలు కొట్టి "సీతా!" అంటూ భూమి మీద పడటం లిప్తపాటులో జరిగిపోయింది.

ఎంత వేగంగా ఢీకొట్టిందో, అంతే వేగంగా ముందుకు దూసుకునిపోయి ఆ వాహనం చీకట్లో కలిసిపోయింది.

ఏం జరిగిందో తెలియని స్థితిలో ఉండిపోయింది సీతాలు. అతని చేతిలోంచి జారిపడిన మల్లెపూలు ఆమె చుట్టూరా పడి ఉన్నాయి. చీకట్లో అవీ నిర్ఘాంతపోయి జాలిగా ఆమెవంకే చూస్తున్నాయి.

ఒక్క ఉదుటున అతన్ని తన ఒడిలోకి తీసుకుంది."సీ...తా...తా... ల సీ... త..సీతా!" ప్రాణమంతా కూడగట్టుకుని పలకలేక పలకలేక పలికి ఆ ఒడిలోనే సుఖనిద్రలోకి జారుకున్నాడు.

ఆమెను దగా చేసింది చీకటా? వెన్నెలా?

చీకటి... చీకటి... కటిక చీకటి...!

దుఃఖపడుతోంది చీకటి!

■

## నవసమాజసారథులం!

బాలలం చిన్నారి బాలలం
ప్రేమే మాకు తెలిసిన సూత్రం
ద్వేషం మాకు ఆమడ దూరం!!
మాయమర్మం తెలియదు మాకు
మలినం అంటని మనసులు మావి
శాంతికి మేమే ప్రతిరూపాలం
సత్యానికి మేం ప్రతినిధులం!
పాపలం చిన్నారిపాపలం
భావిపౌరులం
ముందుతరాలకు మార్గదర్శకులం!
తేడాలన్ని వదిలి
అందరమొకటిగ కదలి
ప్రగతికి బాటలు నిర్మిస్తాం
మేమే మేలని అనిపిస్తాం!
మంచికి మేమే వారసులం
గుండెను కలిపే వారధులం
నవసమాజసారథులం
పరిమళం పంచే సుమబాలలం!

వి.ఎస్.ఆర్.మౌళి